క్లుప్తంగా

సంక్రాంతి సంబరాలు


చిన్నారులపై భోగి పండ్లు పోస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రగతి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల నిర్వాహకులు రామ్మోహన్ రెడ్డి, ఎస్ అమరావతి ఆధ్వర్యంలో చిన్నారులపై భోగి పండ్లు పోసి భోగి మంటలు వేశారు. విద్యార్థులు హరిదాసు, జంగందేవర, ఎరుకలసాని వేషధారణలతో అలరించారు.

రేపు ముగ్గుల పోటీలు

సీతారామపురం: సంక్రాంతిని పురస్కరించుకుని సీతారామపురంలోని శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయాల ప్రాంగణంలో మహిళలకు మండల స్థాయిలో ముగ్గుల పోటీలను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామిశెట్టి తిరుపతయ్య, ఆకుల శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు అందజేయనున్నట్లు వివరించారు.

సర్వపాప హరణం...ఉత్తర ద్వారదర్శనం

సాక్షి, నెట్‌వర్క్: ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లోని వైష్ణవ క్షేత్రాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీవారిని విశేషంగా అలంకరించి భక్తులకు ఉత్తరద్వార దర్శన భాగ్యం కల్పించారు. శ్రీవారిని ఉత్తర ద్వారంలో దర్శిస్తే సర్వపాపాలు తొలగి ముక్కోటి దేవతలు దీవిస్తారనే నమ్మకంతో వేకువజామునే భక్తులు ఆలయాలకు చేరుకుని దర్శించుకున్నారు. జిల్లాలోని ప్రసిద్ధ కొండ బిట్రగుంట క్షేత్రానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దట్టంగా కురుస్తున్న పొగమంచు, వణికిస్తున్న చలిని లెక్కచేయకుండా వేకువజామునే మోక్షప్రదాయమైన స్వామివారి దర్శనం కోసం భక్తులు ఉత్తర ద్వారమైన రాజగోపురం వద్ద బారులు తీరి గోవింద నామస్మరణలతో శ్రీహరికి మేలుకొలుపు పలికారు. భక్తుల కోరికను మన్నిస్తున్నట్లుగా నిత్యసుప్రభాత సేవలు పూర్తి చేసుకున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి విష్ణుమూర్తి రూపంలో గరుడ వాహనంపై కొలువుదీరి ఉత్తర ద్వారానికి చేరుకున్నారు. ఆలయ అర్చక బృందం ప్రత్యే పూజలు నిర్వహించగా, అభయ ముద్రలో క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామి భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు శ్రీవారిని దర్శించుకున్నారు.


కావలిలోని విష్ణాలయంలో ఉత్తర ద్వారదర్శనం చేసుకుంటున్న భక్తులు


వాశిలిలో వరదరాజస్వామి ఉత్సవం


వింజమూరులో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


సంగం: ఉత్తరద్వారంలో ఆత్మారామస్వామి

హైలెవల్ కెనాల్ పనులను వేగవంతం చేయాలి

ఆత్మకూరు: సోమశిల హైలెవల్ కెనాల్ పనులను వేగవంతం చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని నేతాజీ క్లబ్‌లో ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని ఆరు మండలాలకు చెందిన రైతు సంఘ కన్వీనర్లు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని 58 గ్రామాల పరిధిలోని 90వేల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ బాధితులైన రెండున్నర లక్షల మంది ప్రజలకు తాగునీటిని అందించే లక్ష్యంతో 11 ఏళ్ల క్రితం హైలెవల్ కెనాల్ పనులను ప్రారంభించారని తెలిపారు. హైలెవల్ కెనాల్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పనులను వేగవంతం చేయాలని, లేకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు. నాయకులు మూలి వెంగయ్య, లక్ష్మీపతి, కృష్ణప్రసాద్, కాకు వెంకటయ్య, బయ్యన్న, గాడి సుధాకర్, హరి, లాయర్ శేషారెడ్డి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ఉదయగిరి: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను శుక్రవారం నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ నారాయణస్వామి బహుమతులు అందజేశారు.

తల్లిదండ్రులను వేధిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు

కావలి: ఎవరైనా తల్లిదండ్రులను పట్టించుకోకుండా వేధింపులకు గురిచేస్తే చట్టప్రకారం నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అన్నారు. అల్లూరుకు చెందిన ఈగలపాటి చెంచమ్మను కుమారులు వేధిస్తుండడంతో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లితో కలిసి ఆర్డీఓకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఆర్డీఓ మాట్లాడుతూ విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తే సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు నాన్‌బెయిలబుల్ కేసులు పెడుతామని స్పష్టం చేశారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బిట్రగుంట: బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, కమ్మ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే సబ్సిడీ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బోగోలు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. బీసీ కార్యాచరణ ప్రణాళిక ద్వారా 30, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 2, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 3, కమ్మ కార్పొరేషన్ ద్వారా 2, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా ఒక్కో యూనిట్‌ను లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. రెడ్డి కార్పొరేషన్ ద్వారా జెనరిక్ మందుల దుకాణం ఏర్పాటుకు 50 శాతం రాయితీని అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 16వ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థిని ప్రతిభ

మర్రిపాడు: నెల్లూరులో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీల్లో నందవరం ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న జీ వెంగమ్మ ద్వితీయస్థానం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

అల్లూరు: కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఉల్లంఘించి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ కోడిపందేల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, వెటర్నరీ సిబ్బంది, పోలీస్ అధికారులు కలిసి కట్టుగా కోడిపందేలను నిర్వహిస్తే తీసుకునే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించి కట్టడి చేయాలని ఆదేశించారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి కోడిపందేలు నిర్వహిస్తే గేమింగ్ యాక్ట్ -1974 సెక్షన్-10 కింద, జంతుహింస నివారణ చట్టం-1960 సెక్షన్-34 కింద కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీఓ రజనికాంత్, ఏఎస్సై వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



రాయలు ఏలిన ఊరు ఆత్మకూరు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణం ముంబై జాతీయ రహదారికి చేరువలో ఉండడంతో విద్య, వైద్యం, వ్యాపార రంగాలు వేగంగా పుంజుకుంటున్నాయి. గతంలో ఆత్మకూరు ప్రాంతాన్ని శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించారు. ఆయనచే నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయం ఇప్పటికీ మహిమలూరులో ఉంది. కృష్ణదేవరాయల ప్రధానమంత్రి మహామంత్రి తిమ్మరసు అనుంగ శిష్యుడు తిమ్మరాజయ్య యుద్ధాలు లేని సమయంలో సైన్యంతో ఆత్మకూరు చెరువును తవ్వించారు. చెరువుకు ఎదురుగా తూర్పువీధిలో శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయాన్ని నిర్మించారు. నాటి బ్రిటీష్ అధికారుల పాలనలో కచ్చేరి (పరిపాలన కార్యాలయం)ని దేవరాయపల్లి నుంచి ఆత్మకూరుకు మార్చారు. నాడు బ్రిటీష్ పాలకులు నిర్మించిన భవనాలు నేటికీ గుర్తులుగా నిలిచి ఉన్నాయి. అటు రాయలసీమ, ఇటు కోస్తా జిల్లాలకు మధ్యన ఉన్న ఆత్మకూరు ఇరువైపులా వాతావరణాలను పునికిపుచ్చుకుని ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ ప్రజలకు వ్యవసాయం ప్రధాన జీవనాధారం. వరి, పత్తి, పొగాకు, మిరప, తదితర పంటలను ఎక్కువగా పండిస్తుంటారు.

జిల్లా వరదాయిని సోమశిల

జిల్లా వరదాయిని సోమశిల జలాశయం. 78 టీఎంసీల సామర్థ్యంతో సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు, అనేక మండలాలకు తాగునీటిని అందించే ఈ జలాశయం ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోనే ఉంది.

వైద్యరంగంలో..

ఆత్మకూరులో మెరుగైన వైద్యం అందుబాటులో ఉంది. వైద్యం కోసం నెల్లూరు వంటి నగరాలకు పరిగెత్తకుండా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలతో పాటు వైఎస్సార్ జిల్లా బద్వేల్, మైదుకూరు, తదితర దూర ప్రాంతాలకు చెందిన వారు వైద్యసేవలు పొందేందుకు ఇక్కడకు వస్తున్నారు.

విద్యారంగంలో..

విద్యారంగంలోనూ ఆత్మకూరు పట్టణం ఎంతో పేరు గడించింది. ఇక్కడ ఎల్‌కేజీ నుంచి ఇంటర్, ఇంజనీరింగ్ వరకు విద్య అందుబాటులో ఉంది. గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలు సైతం ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. ఫీజులు సైతం మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండడం విశేషం.

వ్యాపార కూడలిగా..

ఆత్మకూరు వ్యాపార కూడలిగా ఉంది. ఆత్మకూరు నియోజకవర్గాన్ని రెండు జాతీయ రహదారులు తాకుతూ వెళ్తున్నాయి. మెరుగైన రహదారులతో తిరుపతి, బెంగుళూరు, హైదరాబాదు, చెన్నై, కర్నూలు, అనంతపురం, బళ్లారి, తదితర దూర ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు ఉన్నాయి. ఆత్మకూరు చుట్టూ పక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిత్యావసరాలు కొనుగోలుకు పట్టణానికి వస్తుంటారు. దీంతో కొత్త వ్యాపార సంస్థలు వస్తున్నాయి.

రియల్ ఎస్టేట్ రంగంలోనూ..

ఆత్మకూరు పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతోంది. మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తరువాత గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆత్మకూరులో స్థిరపడేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకనుగుణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. పట్టణం చుట్టూ విశాలమైన స్థలాలు ఉండడంతో అనేక కొత్త వెంచర్లు ఏర్పాటవుతున్నాయి.

సంక్రాంతికి 426 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- గతేడాది రూ. కోటికిపైగా రాబడి

కావలి: సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ నెల్లూరు రీజియన్ పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం 426 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ నెల 8 నుంచి 12వ తేదీ సంక్రాంతి వరకు 163, సంక్రాంతి తరువాత 263 బస్సులను నడుపుతోంది. నెల్లూరు నుంచి బెంగుళూరు, హైదరాబాద్, విజయవాడ, చెన్నై, తిరుపతి, కడప, కర్నూలు, తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన పలువురు ఉపాధి, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారంతా సంక్రాంతికి సొంతూర్లకు చేరుకుని మూడ్రోజుల పాటు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో సంతోషంగా గడపడానికి ఇష్టపడతారు. అందుకే సంక్రాంతికి స్వగ్రామాలకు చేరుకునే, సంక్రాంతి ముగిసిన తర్వాత తిరిగి వెళ్లే వారితో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతాయి. రైళ్లలో గ్రామాలకు చేరుకునే వసతి ఉండదు. ఒకవేళ ఉన్నప్పటికీ రిజర్వేషన్లు దొరకవు. అందుకే బస్సులపైనే ఎక్కువగా ఆధారపడుతుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి, తదితర ముఖ్య నగరాలతో పాటు రాష్ట్రంలోని మిగిలిన ముఖ్య పట్టణాలకు ప్రత్యేక బస్సులు నడుపుతోంది. గత ఏడాది సంక్రాంతికి 463 సర్వీసులను నడుపగా, రూ.1.04 కోట్ల మేర రాబడి వచ్చింది. కాగా ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లు ప్రారంభమయ్యాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణాధికారి ఏ మురళీబాబు కోరారు.

13న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

సీతారామపురం: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి శాల ఎదురుగా ఉన్న క్రీడామైదానంలో ఈ నెల 13వ తేదీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు, నాల్గో బహుమతిగా రూ.3 వేలు, 5వ బహుమతిగా రూ.2 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి 12వ తేదీలోగా 77309 73749, 94903 00415 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



















